క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం: స్థానిక శ్రీనివాస హేచరీస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఈ ఫీడర్‌లోని అల్లాపురం, దావాజిగూడెం, చిన్నఆవుటపల్లి, మర్లపాలెం, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

వీకేఆర్‌కు వాటర్ కూలర్ వితరణ



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాల విద్యార్థుల తాగునీటి అవసరాల నిమిత్తం శ్రీరామ్ ఆటోమాల్ సంస్థ వాటర్ కూలర్‌ను గురువారం బహూకరించారు. తొలుత వాటర్ కూలర్‌ను ఆ సంస్థ రాష్ట్ర బిజినెస్ హెడ్ వి.రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులు తాగునీటి ఇద్దడిని నివారించేందుకు తమ వంతుగా వాటర్ కూలర్‌ను అందజేశామన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఆటోమాల్ మేనేజర్ పరసా వెంకట రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబా భోజనశాలకు శంకుస్థాపన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న దత్తపరంపర సహిత షిర్డీసాయి మందిరంలో నిర్మించనున్న సాయి ప్రసాదాలయం (బాబా భోజనశాల)కు ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు దంపతులు గురువారం శంకుస్థాపన చేశారు. నిర్వాహకులు చిట్టిబాబు మాట్లాడుతూ జూన్ నాటికి నిర్మాణం పూర్తి చేయనున్నట్టు పేర్కొన్నారు. వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కేసరపల్లిలో టిప్పర్ బోల్తా

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేగంగా వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి వర్తక దుకాణాలపై బోల్తా కొట్టిన సంఘటన గురువారం జరిగింది. గ్రావెల్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ కేసరపల్లిలోని బుద్దవరం వెళ్లే రోడ్డులోకి మలుపు తిరుగుతుండగా ఒక్కసారిగా అదుపు తప్పింది. డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడం వల్ల టిప్పర్ దుకాణ సముదాయం వైపు బోల్తా కొట్టింది. ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడం వల్ల పెనుప్రమాదం తప్పింది. టిప్పర్‌ను పోలీసులు పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొండ ప్రాంత వాసులతో తహసీల్దార్ సమావేశం

అంబాపురం(విజయవాడరూరల్): ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కొండ ప్రాంత వాసులు తహసీల్దార్ జాహ్నవిని కోరారు. అంబాపురం గ్రామంలోని కొండ ప్రాంత వాసులతో తహసీల్దార్ గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా 120 కుటుంబాలు కొండ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నామన్నారు. తమకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి అర్జీపెట్టుకున్న నేపథ్యంలో తహసీల్దార్ వారితో సమావేశం నిర్వహించారు. ఇళ్ల పట్టాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ చెప్పారు. సర్పంచ్ గండికోట సీతయ్య, వీఆర్వో శ్రీనివాసరావు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలన

గన్నవరంరూరల్: మండలంలోని కట్టుబడిపాలెం ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థుల అభ్యసన పరివర్తన కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రాంలో భాగంగా తరగతి గది పరిశీలన జరిగింది. మూడో తరగతి విద్యార్థులకు భిన్నాలు పాఠాన్ని ఉపాధ్యాయుడు డి.సురేష్ బోధించాడు. ఆ తరగతి పరిశీలనను సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ప్రోగ్రాం ట్రైనర్స్, గోపవరపుగూడెం ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం మల్లెల తేజోమయి, సీఆర్పీ కాంద్రు మోహనరావు పరిశీలించారు. తరగతి గది పరిశీలన పత్రాలను కొత్తగా రూపొందించిన టీచ్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరింతగా పెంచేందుకు ప్రభుత్వం ఈ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేసి తమకు శిక్షణ ఇచ్చిందన్నారు.

స్కూల్ సందర్శించిన నైజీరియన్ టీమ్

పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ శివారు వెంకటాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నైజీరియన్ దేశం నుంచి వచ్చిన ఎడ్యుకేషనల్ టీమ్ గురువారం పరిశీలించారు. వివిధ స్థాయిల్లో ఉన్న విద్యార్థులందరితో ధారాళంగా చదివేందుకు నిర్వహిస్తున్న తర్ల్ ప్రోగ్రామ్‌ను నైజీరియన్ టీమ్ పరిశీలించింది. తర్ల్ క్లాస్ రూమ్ నిర్వహణ, యాక్టివిటీ బేస్డ్ టీచింగ్‌ను ఆ టీమ్ పరిశీలించింది. కిచెన్ గార్డెన్ ఐటమ్స్‌తో సంతయాక్టివిటీని, ఫేక్ కరెన్సీతో నిర్వహించడం, సునాయాసంగా లెక్కలు చేయడం చూసి నైజీరియన్ ఎడ్యుకేషనల్ టీమ్ అబ్బురపడ్డారు. కార్యక్రమంలో తర్ల్ కో ఆర్డినేటర్ రాంబాబు, ఎస్‌సీఈఆర్‌టీ డీఆర్ టీచర్, పి.కుసుమ, స్కూల్ టీచర్లు పి.మనోజ, సీహెచ్.అరుణకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు



సిద్ధం చేసిన దేవుడి ప్రభ

పెనమలూరు:మండలంలోని యనమలకుదురు గ్రామంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో 20 వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు స్వామివారిని పెళ్లి కుమారుడిని చేస్తారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో భక్తుల కోసం ప్రభుత్వ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవటానికి వీలుగా క్యూలైన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎండ లేకుండా ఆలయ ప్రాంగణంలో చలవ పందిళ్లు వేశారు. ఎల్‌జీ సంస్థ సహకారంతో సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచారు. మండపం వద్ద దేవుడి ప్రభును రాతి చక్రాల రథం పై సిద్ధం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, వైద్య సేవలు అందుబాటులో ఉంచారు.

దాతల సహకారం...

కాగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దాతలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందించారు. రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు దేవస్థానం, మెట్ల మార్గం, పార్కింగ్‌లో పూర్తి లైటింగ్‌కు రూ.7 లక్షలు విరాళం ఇచ్చారు. అలాగే ఫోక్ లైట్లు, జనరేటర్‌కు మరో రూ.2 లక్షలు అందచేశారు. ఎల్‌జీ కంపెనీ మినరల్ వాటర్, దాత మూర్తి సత్యనారాయణ 1500 లీటర్ల మజ్జిగ, రామలింగేశ్వర ట్రస్టు పది క్వింటాళ్ల ప్రసాదం, వికలాంగులు, వృద్ధులు కొండ పైకి వెళ్ల టానికి ఉచిత వాహనాలు ఏర్పాటు చేశారు.



భక్తుల కోసం చలవ పందిళ్లు



భక్తుల దర్శనానికి బారికేడ్లు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు...

యనమలకుదురు గ్రామంలో నేటి నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని, భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాని ఆర్డీవో విజయ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో గురువారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొండ పై వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారిని దర్శించుకోవటానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తారన్నారు. స్వామివారి దర్శనానికి ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. చలవ పందిళ్లు, తాగునీరు అందుబాటులో ఉంచామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కొండ పైన, కొండ కింద కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, డెప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులు కంట్రోల్ రూమ్‌లో ఉంటారని తెలిపారు. వైద్య శాఖ సహకారంతో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పారిశుద్ధ్యం పర్యవేక్షిస్తుందన్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న ఆర్డీవో విజయ్‌కుమార్

ప్రభల ప్రదర్శనకు భద్రత..

మహాశివరాత్రి పర్వదినం నాడు ప్రభల ప్రదర్శనకు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశామన్నారు. దేవస్థానం ప్రభ ఎట్టి పరిస్థితుల్లో 18వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవ్వాలన్నారు. సీరియల్ ప్రకారం ఉన్న మిగతా 34 ప్రభలు కూడా సకాలంలో కొండ చుట్టూ ప్రదర్శన చేయాలని సూచించారు. దాదాపు 900 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. యనమలకుదురు లాకులు, ఫుట్‌బ్రిడ్జి, డొంక రోడ్డు వంతెన వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా చూస్తాన్నారు. పుణ్యనదీ స్నానాల వద్ద ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను ఉంచామని వివరించారు. డీఎస్పీ విజయ్ పాల్, తహసీల్దార్ టీవీ సతీష్, సీఐ.గోవిందరాజు, ట్రాఫిక్ సీఐ ఆలీ, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజారోగ్యం మెరుగు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



నున్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గర్భిణులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

విజయవాడరూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజారోగ్యం మెరుగవుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను పరిశీలించేందుకు గురువారం జిల్లా కలెక్టర్ వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నున్న హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో గర్భిణులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్టోబర్ నుంచి ఫ్యామిలీ డాక్టర్ సేవలను ట్రయిల్ రన్‌గా ప్రారంభించి, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 257 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఇప్పటి వరకు 61,944 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారన్నారు. మహిళలు గర్భందాల్చిన మొదటి మాసం నుంచి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 239 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్యులు, సిబ్బంది 104 వాహనం ద్వారా గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వైద్య వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా 67 రకాల మందులు అందుబాటులో ఉంచామని, 14 రకాల డయాగ్నస్టిక్ మెడికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారన్నారు. కలెక్టర్‌తో పాటు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మాధురి, ఎం.ఎల్.హెచ్‌పి రమ్య, పర్యవేక్షకులు డీఎం ఆర్.రత్నం, నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం రజనీ, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి



బూత్ స్థాయి అధికారులలో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి, ఎంపీడీఓ భార్గవి

విజయవాడరూరల్: పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలని మండల తహసీల్దార్ పి.జాహ్నవి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గంలోని 9 గ్రామాల్లోని పోలింగ్ బూత్‌స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ టార్గెట్ పూర్తయ్యే వరకు ప్రతి రోజూ ఆధార్ లింక్ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యామ్నయ బాధ్యతలను అప్పగించడం కుదరదని ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారే నిర్వహించాలన్నారు. అదనపు ఎలక్ట్రోల్ అధికారి, ఎంపీడీఓ బి.భార్గవి మాట్లాడుతూ.. ఆధార్ అనుసంధానంలో విజయవాడ రూరల్ మండలం చివరి స్థానంలో ఉందన్నారు. 33,173 మంది ఆధార్ లింక్ చేయాల్సి ఉందన్నారు. ప్రతి రోజూ ప్రగతి కనిపించాలని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ గోపాలరెడ్డి మాట్లాడుతూ.. ఆరు నెలల వ్యవధిలో 58 శాతం ఆధార్ లింక్ చేశామన్నారు. ఆరు నెలలపాటు ఇంటి వద్ద లేని వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని చెప్పారు.

సమష్టిగా పనిచేసి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తా శ్రీనివాసరావు

కంకిపాడు:సమన్వయంతో సమష్టిగా పనిచేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పునాదిపాడు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సాధించటంతో పాటుగా సమష్టిగా, ఐక్యంగా పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు. సచివాలయాల్లో నూతనంగా బాధ్యతలు తీసుకుంటున్న సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సమర్థంగా పనిచేయాలని సూచించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



డ్రాగన్ ఫ్రూట్ సాగు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో ఉద్యానవన పంటలను గురువారం జిల్లా హార్టీకల్చర్ అధికారి జ్యోతి పరిశీలించారు. స్థానికంగా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుచేస్తున్న రైతు సుధాకర్‌తో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ ప్యాక్ హౌస్ కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తంగా 4 లక్షల రూపాయలు ఖర్చు కాగల ప్యాక్ హౌస్ నిర్మాణానికి ఉద్యానవన శాఖ రూ.2 లక్షలు సబ్సిడీగా అందిస్తోందన్నారు. మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలు సాగుచేసే రైతులు వాటిని 20-30 సైజులో నిర్మించే ప్యాక్ హౌస్‌లో వాటిని శుభ్రపరిచి, గ్రేడింగ్ చేసి ప్యాక్ చేసుకోవచ్చునన్నారు. దీంతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని చెప్పారు. కొత్తగా మామిడి తోటలు సాగు చేస్తున్న రైతుల వివరాలను మండల హార్టీకల్చర్ అధికారి హరిచంద్, వీహెచ్ఏ దీక్షా ఆయనకు వివరించారు. ఉద్యానవన పంటల సాగు రైతులను ప్రోత్సహించి వారికి ప్రభుత్వం అందించే పథకాలు, సబ్సిడీలు వివరించాలని ఆదేశించారు.

ఆప్తాలమిక్ ఆఫీసర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వినతి

ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన ఆప్తాలమిక్ ఆఫీసర్లు



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లు

కంకిపాడు: ఆప్తాలమిక్ ఆఫీసర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయంలో అయన్ను కలుసుకుని వినతిపత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వివి రాజేష్‌కుమార్ కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో పనిచేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లను ముఖ్యమంత్రి ఐ కేంద్రాల్లో కొనసాగేలా, లేదా విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేసేలా ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే పనిచేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 9 నెలలుగా అందాల్సిన వేతన బకాయిలను విడుదల చేసి ఉద్యోగులకు బాసటగా నిలవాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్తామని సజ్జల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారన్నారు.

ప్రణాళిక, సమయపాలనే విజయానికి సోపానాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏ రంగంలోనైనా లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదల, ప్రణాళిక, సమయపాలనే విజయానికి సోపానాలు అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవతా ఆధ్వర్యంలో స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతి బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, నైతిక విలువలపై గురువారం తరగతులు నిర్వహించారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు విద్యార్థులు చక్కటి ప్రణాళికను సిద్ధం చేసుకుని సమయపాలన పాటిస్తూ, పట్టుదలతో కృషి చేయాలని మారుబోయిన చెప్పారు. చదువుతో పాటుగా నైతిక విలువలను కూడా అలవర్చుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు.

నిర్విరామ కృషి చేయాలి

విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ మహిళా ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి,జ్యోతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ బాలథెరిస్సా, చక్కా సుబ్బారావు, సీనియర్ సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, కొట్నేని రామచంద్రరావు, పొట్లూరి శేషాచలం పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి



ఎంపీ వల్లభనేని బాలశౌరికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

విజయవాడరూరల్: గొల్లపూడి-అవుటుపల్లి నేషనల్ బైపాస్ రోడ్డుకు సర్వీస్‌రోడ్డు ను నిర్మింపచేయాలని ఎంపీ వల్లభనేని బాలశౌరిని రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు. విజయవాడలో ఎంపీ బాలశౌరిని నున్న, కండ్రిక, పాతపాడు, అంబాపురం, పి.నైనవరం, రామచంద్రపాలెం, కొండపావులూరు, వెదురుపావులూరు గ్రామాలకు చెందిన రైతులు గురువారం కలిశారు. సర్వీసు రోడ్డును నిర్మించడానికి నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను విన్న పిమ్మట ఎంపీ బాలశౌరి నేషనల్ హైవే రీజినల్ ఆఫీసర్ ఆర్‌కె.సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల వ్యవసాయోత్పత్తులను ఇంటికి తీసుకొచ్చేందుకు అవసరమైన సర్వీసు రోడ్డు నిర్మించాలన్నారు. సర్వీసు రోడ్డు నిర్మించే వరకు సరిహద్దు గోడల నిర్మాణం కూడా నిలిపివేయాలని రైతులు కోరారు.

ఎన్‌సీసీ విభాగాధిపతికి కెప్టెన్ ర్యాంకు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్‌సీసీ విభాగాధిపతి లెఫ్టినెంట్ కానుగుల సత్యనారాయణ కెప్టెన్ ర్యాంకు పొందారు. కాలేజీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 1(ఎ)ఈఎంఈ కాయ్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంజయ్ తన్వర్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి కెప్టెన్ ర్యాంకును సత్యనారాయణకు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

130 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 130 మంది వృద్ధులకు ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ కంటి సమస్యలతో వృద్ధాప్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రాథమిక దశలోనే సమస్యలను గుర్తించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అత్తింటి వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చెందిన కొండపావులూరి ప్రమీలను గత కొద్దిరోజులుగా ఆమె అత్త, ఆడబడుచు, ఆడబడుచు కుమార్తెలు మానసికంగా, శారీరకంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమీలను వీరు ముగ్గురు గురువారం తీవ్రంగా గాయపర్చారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు



ఏటిపాయ వద్ద నీటి ఉద్ధృతిని పరిశీలిస్తున్న పూజిత, ఎస్ఐ లక్ష్మి తదితరులు

కంకిపాడు: మద్దూరు ఏటిపాయలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పూజిత సూచించారు. మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలోని ఏటిపాయను అధికారుల బృందంతో కలిసి గురువారం ఆమె సందర్శించారు. పూజిత, అదనపు ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నది లోపల బారికేడ్లు, కాషన్ టేపు, హెచ్చరిక బోర్డులను పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. నదిలో ముందస్తు జాగ్రత్తగా 20 మంది గజ ఈతగాళ్లను, 10 బోట్లను అందుబాటులో ఉంచామన్నారు. సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు వి.శ్రీనివాసరావు, ఈఓ చింతా కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరికీ అవసరం



మంతెనలో ర్యాలీ నిర్వహిస్తున్న సప్తగిరి మేనేజరు పి. రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరికీ అవసరమని మంతెన సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు పి.రమేష్ సూచించారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమాలు గురువారం మంతెనలో నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. బ్యాంకు మేనేజరు పి.రమేష్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను తెరిచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి నెలా కుటుంబంలో ఆదాయ , వ్యయాలను సమీక్షించుకుని ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం వైఎస్ఎన్ ప్రసాద్, సొసైటీ ప్రతినిధులు కై లే సునీల్, పల్లి రాజేష్ పాల్గొన్నారు. తొలుత బ్రాంచ్ మేనేజరు రమేష్ చేతులమీదుగా ఆర్థిక అక్షరాస్యత బ్రోచర్లు ఆవిష్కరించారు.

వైభవంగా కల్యాణోత్సవం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేంచేసి ఉన్న శ్రీభద్రావతి సమేత శ్రీభవనాఋషి దేవస్థానంలో గురువారం శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన తర్వాత నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం మూలా నక్షత్రయుక్త మేషు లగ్నంలో శ్రీభద్రావతి సమేత శ్రీభవనాఋషిస్వామికి మంగళ వాయిద్యాలు, వేద పండితులు మంత్రోర్చనలతో కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పలువురు దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

23న మండల పరిషత్ సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరు, సంక్షేమ పథకాలు అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

బ్లూమింగ్ పాఠశాలకు ఐబీడీపీ గుర్తింపు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పాఠశాల ప్రతినిధులు

పెనమలూరు:గంగూరు బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ పాఠశాలకు గ్రేడ్ 11,12 తరగతులకు ఇంటర్నేషనల్ బ్యాకులరేట్ డిప్లమా ప్రోగ్రాం(ఐబీడీపీ) గుర్తింపు లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ హర్ సిమ్రన్ కౌర్ కపానీ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో వివరాలు తెలుపుతూ ఏపీలో ఏకైక పాఠశాలగా తమ పాఠశాల అవతరించిందన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్ ఆవిష్కరించారు. తమ పాఠశాల స్థాపించిన ఆరు సంవత్సరాల వ్యవధిలోనే ఐబీడీపీ గుర్తింపు పొందిందన్నారు. పాఠశాల చైర్మన్ విజయ్ బాబు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని బ్లూమింగ్ డేల్ పాఠశాలను స్థాపించారని చెప్పారు. ఐబీడీపీ గుర్తింపుతో దేశ విదేశాల్లో ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్‌లు లభిస్తాయన్నారు. డీపీ కోఆర్డినేటర్ కరణ్, అడ్మిన్ హెడ్ షబనా పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చిలుకోటి కస్తూరిబాయి భర్త: నాగేంద్రరావు, డోరు నెం. 5-40A, మల్లేశ్వరం, నిడుమోలు పోస్ట్, మొవ్వ మండలం, కృష్ణాజిల్లా.
నా పేరున మచిలీపట్నం సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన డాక్యుమెంట్ నెం. 1807/1981 (ఆర్.యస్. నెం. 55/1, 55/5) సదరు డాక్యుమెంట్స్ ది. 18-01-2023న మా ఇంటి నుండి ఆటోలో ప్రయాణిస్తుండగా పోరంకి క్యాపిటల్ హాస్పిటల్ సమీపంలో పోయినవి. దొరికిన వారు అందజేయ ప్రార్థన
చిలుకోటి కస్తూరిబాయి
సెల్: 94944 97257